# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌ను ఆహార పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక శాఖ .. తిరుపతి ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది.**

**2. తెలంగాణ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.**

**3. ఆంధ్రప్రదేశ్ లో పెట్రోల్ కొరత లేదని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.**

**4. రాష్ట్రంలో వయోవృద్ధులకు "మన మిత్ర" వాట్సాప్ సేవ ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ను ఆహార పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో రాష్ట్ర పర్యాటక శాఖ తిరుపతి ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో రాష్ట్ర సచివాలయంలో నిన్న అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రా రుచులను, తెలుగు వంటకాలను పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతి ప్రచారానికి ఈ ఒప్పందం దోహద పడుతుందని అధికారులు తెలిపారు. ఆహార విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, రాష్ట్ర పర్యాటక శాఖ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారని తెలిపారు.

------------------------

తెలంగాణ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి ఇంధన నిల్వలు, సరఫరాలపై హైదరాబాద్ లో నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని చెప్పారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో పెట్రోల్ నిల్వలపై జిల్లా కలెక్టర్ డి.

హరి చందన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..30.. సెకన్లు

-----------------------------

మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి వారి ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్ అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ సహకారంతో భారత మహిళా పారిశ్రామికవేత్తల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ లో ఏర్పాటు చేసిన "ఉద్యమి టు ఉన్నతి" – ప్రదర్శన 2026ను ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఎగ్జిబిషన్‌లోని వివిధ స్టాళ్లను సందర్శించి, ఉత్పత్తుల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వ రంగ సంస్థల మార్కెట్‌లతో అనుసంధానించడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లో పెట్రోల్ కొరత లేదని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం పెట్రోల్ లభ్యతపై పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..25.. సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వయోవృద్ధులకు "మన మిత్ర" వాట్సాప్ సేవ ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందిస్తున్నట్లు వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన వయోవృద్ధుల కౌన్సిల్ సమావేశంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, సైబర్ నేరాల పట్ల వృద్ధులకు విస్తృత అవగాహన అవసరమని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీలు, సీట్ల కేటాయింపును సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం కలెక్టర్ కార్యాలయాల్లో లిఫ్ట్‌లు, చక్రాల కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి వివరించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలోని గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నిన్న ప్రారంభించారు. ఆగిరిపల్లి మండలంలోని ఈదర, శోభనాపురం గ్రామాల్లో సీసీ రోడ్లను చిన్న ఆగిరిపల్లిలో నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. చొప్పరమెట్ల, ఈదులుగూడెం గ్రామాల్లో రహదారులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..30...సెకన్లు

-----------------------------

దేశంలోని అన్ని ఆకాశవాణి కేంద్రాలు జాతీయ గేయం ‘వందేమాతరం’ను ఆరు చరణాలతో పూర్తిగా ఈ రోజు నుంచి ప్రసారం చేస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, ఆల్ ఇండియా రేడియో కేంద్రాలు ఉదయం ప్రసారాలను ప్రసిద్ధ ‘సిగ్నేచర్ ట్యూన్’తో ప్రారంభించి, ఆ తర్వాత ‘వందేమాతరం’ రెండు చరణాలను ప్రసారం చేస్తూ వస్తున్నాయి. జాతీయ గేయానికి సంబంధించి కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా, అన్ని రేడియో స్టేషన్లు ఈ రోజు నుండి 3 నిమిషాల 10 సెకన్ల నిడివితో ఆరు చరణాల పూర్తి వందేమాతరం గీతాన్ని ప్రసారం చేస్తాయని కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 132 వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

దక్షిణ అంతర్గత కర్ణాటక పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మీ తెలియజేస్తూ..

.వాయిస్...20 సెకన్లు.

తెలంగాణలోనూ రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో బీసీ వసతి గృహాల్లో అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో రెండు నెలల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో, హాస్టళ్లలో మౌలిక వసతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా శౌచాలయాల నిర్మాణం, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటును వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వసతి గృహాల్లో దోమల నివారణ కోసం తెరలు ఏర్పాటు చేయడంతో పాటు, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు.

====================